క్లుప్తంగా...

రేపు సంతోషీమాత వార్షిక జన్మదినోత్సవాలు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలోని సంతోషీ మాత అమ్మవారి వార్షిక జన్మదిన ఉత్సవాలను ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు ఈవో మహేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉ. 5 గంటలకు సుప్రభాతం, నాదస్వరం, 5.30 గంటలకు మూలవిరాట్ శుద్ధి, ఆవుపాలు, కొబ్బరి బోండా జలాలు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, కలశాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 8వ తేదీన ఉదయం 7.30 గంటలకు సంతోషీ మాతా అమ్మవారికి సామూహిక సహస్ర పుష్పార్చన జరుగుతుందన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసాయి. చివరిరోజైన మంగళవారం పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామికి 108 కలశాలతో అభిషేకం చేశారు. స్వామివారి కైంకర్యంలో జరిగే లోపాలు, దోషాలను పరిహరించుకునేందుకు ప్రతిఏటా పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణు గోపాలరావు, ఈఓ రాజేంష్‌కుమార్‌లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మేరీ ఫీస్ట్ వేడుకలు ప్రారంభం



మేరీ ఫీస్ట్‌లో పాల్గొన్న జీవకన్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం అమ్ముగూడ జేజేనగర్ కాలనీలో మేరీ ఫీస్ట్ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మేరీమాతా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవకన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 8 వరకు పలు కార్యక్రమాలు ప్రతి రోజు ఉంటాయన్నారు.

హామీల అమలుకు వినతి



బౌద్ధనగర్: ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటనీ అమలు చేయాలని కోరుతూ టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ మంగళవారం ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో రైతులు, నిరుద్యోగులు, మైనార్టీలు, గిరిజనులు, దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని వెంటనే ఆ హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో ప్రవీణ్‌కుమార్, వెంకటస్వామి, మల్లేష్ యాదవ్, చంద్రమోహన్, చిరంజీవి, శశిరేఖ ఉన్నారు.

టెట్, డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ టెస్ట్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా టెట్, డీఎస్సీలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లాల వారీగా ఉచిత ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ హైదరాబాద్, సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ తెలిపారు. టెట్ అభ్యర్థులకు సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు సబ్జెక్ట్ వారీగా, సెప్టెంబర్ 8 నుంచి 12 టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు ప్రతి ఆదివారం గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామని అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9246208422, 8885555202, 8008954440 నంబర్లను సంప్రదించాలన్నారు.

కళ్లల్లో కారంపొడి కొట్టి పార్శిల్స్ దోపిడీ

రాంగోపాల్‌పేట్: డెలివరీ బాయ్ కళ్లలో కారం పొడి కొట్టి పార్శిల్స్‌ను దోచుకెళ్లిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్క్‌లేన్‌కు చెందిన ఓంప్రకాష్ మౌర్య సీటీసీలోని వీబీఎస్ పార్శిల్ సర్వీస్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్‌లలోని కొరియర్ కార్యాలయాల్లో ఒక పార్శిల్ నారాయణగూడలో ఐదు పార్శిళ్లు తీసుకుని పార్క్‌లేన్‌లోని కార్యాలయానికి బయలు దేరాడు. 9 గంటల సమయంలో ఎస్డీరోడ్‌లోని హాంగ్‌కాంగ్ బజార్ వద్ద సీటీసీలోకి వెళ్లే మార్గంలో ఇద్దరు దుండగులు వచ్చి అతన్ని అడ్డగించి బైక్‌పై నుంచి కిందకు తోసి ఓంప్రకాష్ ముఖంపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా కళ్లలో కారంపొడిని చల్లి చేతిలోని పార్శిళ్లు ఉన్న బ్యాగును లాక్కుని అక్కడి నుంచి ఉడాయించారు. వినియోగదారులకు చెందిన పార్శిళ్లలో సుమారు రూ.9.56 లక్షల విలువైన వస్తువులు ఉన్నాయని అయితే అవి ఏమున్నాయో వినియోదారులకు మాత్రమే తెలుస్తుందని ఓం ప్రకాష్ పేర్కొన్నాడు.



ఇటీవల పూర్తయిన పికెట్ నాలాపై బ్రిడ్జి

బ్రిడ్జిల నిర్మాణం.. వరదలతో లేదు భయం

- పికెట్ నాలా, కళాసీగూడ నాలాలపై ఫైవంతెనల నిర్మాణాలు
- సాఫీగా పారుతున్న వరద
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీలవాసులు

రాంగోపాల్‌పేట్: వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఆ కాలనీల వాసుల్లో భయం పుట్టుకొచ్చేది. చిన్న పాటి వర్షం కురిసినా సరే ఆ కాలనీల్లో ముంపు తప్పేది కాదు. వర్షాకాలంలో అక్కడి ప్రజలు ఇంట్లో నుంచి అడుగు బయటకు పెట్టాలంటే సాహసం చేయాల్సిందే. ఇది కొన్ని దశాబ్దాల నుంచి కొన్ని కాలనీలవాసులు పడే బాధ. కానీ ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో ఈ కాలనీల ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. వరద ముంపు తప్పిపోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పికెట్ నాలా పరీవాహక ప్రాంతంలోని సింధీకాలనీ, పీజీరోడ్, ప్యాట్నీనగర్ ప్రాంతాలు, కళాసీగూడ నాలా పరీవాహక ప్రాంతంలోని ఆర్పీరోడ్, మారుతీవీధి, శంకర్‌వీధి, నాలాబజార్ తదితర ప్రాంతాల వందల కుటుంబాల ప్రజలు ఇప్పుడు ఎంత వరదలు వచ్చినా తమకేమి కాదనే ధీమాతో ఉంటున్నారు.

మూడు చోట్ల నూతనంగా బ్రిడ్జిలు

పికెట్ నాలా కంటోన్మెంట్ ప్రాంతం నుంచి వచ్చి ఎస్పీరోడ్‌లోని అశోక భూపాల్ చాంబర్స్ ప్రాంతంలో రోడ్డును దాటి సింధీకాలనీలోకి వస్తుంది. అలాగే మినిస్టర్ రోడ్డును దాటుతూ హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. ఈ నాలాపైన ఎస్పీరోడ్డు, మినిస్టర్‌రోడ్డులో గత కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జిలు ఉన్నాయి. అప్పటి అవసరాలకు అనుగుణంగా ఆ బ్రిడ్జిలు నిర్మించారు కానీ.. ప్రస్తుతం జనాభా పెరిగిపోవడం, మురుగు నీరు కూడా ఈ నాలాల్లోకి వచ్చి చేరడంతో నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీనికి తోడు నాలా కూడా చాలా చోట్ల కుంచించుకుపోయింది. ఇక వర్షం పడితే పై నుంచి వచ్చే వరద పెరిగిపోయి ఎస్పీరోడ్డులోని బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో అటు ప్యాట్నీనగర్ తదితర ప్రాంతాలు వరద ముంపుకు గురికావడంతో పాటు వరద నీరు రోడ్డు పైకి ఎక్కి పారేవి. మినిస్టర్ రోడ్డులోని బ్రిడ్జి కూడా ఇలాగే ఇరుకుగా ఉండటంతో ఇటు సింధీకాలనీ, పీజీరోడ్డు తదితర ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరేది. దీంతో ఇక్కడి ప్రజలు నరకయాతన అనుభవించే వాళ్లు. ఇలా కొన్ని సంవత్సరాల నుంచి ఈ కాలనీల్లోని ప్రజలకు ఈ సమస్య వెంటాడుతూ ఉంది. ఎస్పీరోడ్‌లో రూ. 10 కోట్లు, మినిస్టర్‌రోడ్‌లో రూ. 4.5 కోట్లతో బ్రిడ్జి పనులు పూర్తి చేశారు. అలాగే కళాసీగూడపై కూడా ఆర్పీరోడ్‌లో రూ.1.70 కోట్ల ఎస్ఎన్‌డీపీ నిధులతో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కొత్త బ్రిడ్జిని నిర్మించారు.

తీరిన ముంపు భయం

మొదట కళాసీగూడ నాలాపై ఆర్పీరోడ్‌లోని దర్గా ప్రాంతంలో బ్రిడ్జిని నిర్మించి పూర్తి చేశారు. దీంతో ఆర్పీరోడ్, శంకర్‌వీధి, మారుతివీధి, నాలాబజార్ తదితర ప్రాంతాల్లో వరద ముంపు తప్పింది. చిన్న పాటి వర్షానికే ఇక్కడి ఇళ్లలోకి మోకాళ్లలోతు నీళ్లు, బురద వచ్చి చేరేది. ఇప్పుడు ఈ ప్రాంతం ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. తర్వాత పికెట్ నాలా పై ఎస్పీరోడ్‌లో, మినిస్టర్‌రోడ్‌లో రెండు బ్రిడ్జిల నిర్మాణాలు కొద్ది రోజుల క్రితం పూర్తి చేశారు. ఇప్పుడు, కంటోన్మెంట్‌లోని ప్యాట్నీ నగర్, సనత్‌నగర్‌లోని సింధీకాలనీ, పీజీరోడ్ ప్రాంతాల్లో వరద ముంపు భయం తీరిపోయింది. నాలాపై కొత్త బ్రిడ్జిలను ఎత్తు పెంచడంతో పాటు కింద నీరు సాఫీగా వెళ్లేలా విశాలంగా నిర్మించారు. దీంతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం..



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంత్రి ఎన్ని కోట్ల రూపాయల నిధులు అయినా వెచ్చించి పూర్తి చేయిస్తున్నారు. వందల కోట్ల రూపాయలు నియోజకవర్గంలో ఖర్చు చేశారు. కొన్ని దశాబ్దాల నుంచి పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యాయి.

–మహేశ్వరి, కార్పొరేటర్ బేగంపేట

ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు రూ. 210 కోట్లు మంజూరు

రోడ్లు, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, లింక్ రోడ్ల నిర్మాణాలు



ఉన్నతాధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా నూతన రోడ్ల నిర్మాణం, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, లింక్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అందులో భాగంగా సనత్‌నగర్‌వాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు రూ.210 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాణిగంజ్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), సనత్‌నగర్ ఆర్ఓబీ, ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ పనుల పురోగతిపై మంగళవారం ఆయన బుద్ధభవన్‌లో రైల్వే, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం వీటి నిర్మాణాల కోసం రూ.210 కోట్లు మంజూరు చేసిందని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం నుంచి బాలానగర్ వరకు అండర్ పాస్ నిర్మాణం కోసం రూ.105 కోట్లు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు రోడ్డు విస్తరణ చేసి ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా చేయడం జరిగిందన్నారు. ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై కూడా ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్నందున ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ పనులు చేపట్టేందుకు అడ్డంకిగా ఉన్న రైల్వే ట్రాక్‌ల వద్ద ఆర్‌యూబీలను నిర్మించేందుకు రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు అనువుగా కొన్ని ప్రాపర్టీస్‌ను సేకరించాలని గుర్తించి వాటిలో కొన్ని సేకరించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే సేకరించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్, చీఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి రాజేంద్ర ప్రసాద్ నాయక్, హెచ్ఆర్‌డీసీఎల్ సీఈ సరోజ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రే, రవికిరణ్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, రైల్వేస్ డిప్యూటీ సీఈ మనోహర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఎస్ఈ బ్రహ్మం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్ల ప్రజలు విసిగిపోయారు



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులతో కోట నీలిమా

సనత్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పజెప్పేందుకు సమాయత్తమవుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. సుభాష్‌నగర్, నీమకార్ బస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు స్థానాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని విమర్శించారు. సనత్‌నగర్‌లో సాధారణ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిప్పు, ముఖేష్, విజయ్‌కుమార్, సుభాష్, లలిత, పవన్ పాల్గొన్నారు.

డివిజన్‌లో పాదయాత్ర..

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో మహిళా సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని కోట నీలిమా విమర్శించారు. మంగళవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ ఆవులమందలోని పార్టీ కార్యాలయంలో ఆమె స్థానిక మహిళతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ మాసం సందర్భంగా వారికి పసుపు, బొట్టు అందించిన అనంతరం డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో మహిళలకు అతి తక్కువ మందికి సీట్లు కేటాయించడం చూస్తే ఆ పార్టీకి మహిళలపై ఏ మాత్రం గౌరవం ఉందో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, కవిత, ఉషా రమణ, రజిని, మనీషా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజల ఆదరణ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్‌లలోని పలు బస్తీల్లో మంగళవారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చేవెళ్లలో జరిగిన ఎస్సీ, ఎస్టీ సభలో చేసిన పలు తీర్మానాలతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యాస్ ధర తగ్గింపు, మహిళలకు ఉచితంగా బస్సులలో సదుపాయాలు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, షాబాద్ సత్యనారాయణ, కమల్‌రాజ్, తోట మణిమాల, గోవింద్, శ్రీనివాస్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతా



మాట్లాడుతున్న జాన్ బాబు

కంటోన్మెంట్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తాను బరిలో దిగుతున్నానని ఆ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ మామిడిగళ్ల జాన్ బాబు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం పెద్దల సూచనతోనే తాను కంటోన్మెంట్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేశానన్నారు. 40 ఏళ్లుగా విద్యార్థి నాయకుడు, యువజన కాంగ్రెస్‌లోనూ, అనుబంధ కార్మిక విభాగం ఐఎన్‌టీయూసీలో పనిచేశానన్నారు. కంటోన్మెంట్‌కు నిధుల కేటాయింపు విషయంలో ఒకరిపై ఒకరు విమర్శలు తప్ప బీజేపీ, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు.

ఎన్‌హెచ్ఆర్సీ ద్వారా అన్ని వర్గాలకు న్యాయం



సమావేశంలో పాల్గొన్న ఎన్‌హెచ్ఆర్సీ ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కౌన్సిల్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో సంస్థ గ్రేటర్ హైదరాబాద్ నగర శాఖ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీలు, సంస్థలతో సంబంధం లేకుండా స్వతంత్ర సంస్థగా పేద, అణగారిన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు న్యాయం అందేలా చూస్తామన్నారు. వివిధ హక్కుల ఉల్లంఘనలు, న్యాయ సహాయం, సమాచార హక్కు చట్టం తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఎన్‌హెచ్ఆర్సీ సభ్యులకు సమాచార హక్కు చట్టం జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లో సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఆర్కే ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి ప్రకాష్, కార్యవర్గ సభ్యులు ప్రభాకరచారి, దైవాదీనం, వంశీకృష్ణ, యోగా కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసులో వ్యక్తికి జైలు

రాంగోపాల్‌పేట్: ఈ-పెట్టీ కేసులో ఓ వ్యక్తికి మూడ్రోజుల జైలు శిక్ష విధించారు. రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఎండీ రహ్మద్ అలీఖాన్ (41) సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలోని జమ్ జమ్ హోటల్‌లో ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ఇటీవల హోటల్‌ను అర్ధరాత్రి ఒంటిగంట వరకూ తెరిచి ఉంచడంతో పోలీసులు ఈ-పెట్టీ కేసును నమోదు చేసి 16వ స్పెషల్ ఎంఎం కోర్టు ముందుకు హాజరు పర్చగా అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. గతంలోనూ ఇదే హోటల్ నిర్వాహకులు పలుమార్లు నిబంధనలు ఉల్లంఘిస్తూ రాత్రి ఒంటిగంట తర్వాత కూడా తెరిచి ఉంచడంతో పోలీసులు పెట్టీ కేసులు నమోదు చేశారు.

ఉత్సాహంగా తీజ్



ఓయూలో తీజ్ ఉత్సవాలను మంగళవారం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లేడీస్ హాస్టల్ నుంచి మొలకెత్తిన నారును ఆర్ట్స్ కాలేజీ వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గిరిజనుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. – ఉస్మానియా యూనివర్సిటీ

ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. టీచర్స్, హెల్పర్స్‌కు ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించినందుకు గానూ యూనియన్ అధ్యక్షురాలు నల్ల భారతి ఆధ్వర్యంలో కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



నియామకం



రాహుల్ నేతికార్

లాలాపేట: బీజేపీ ఐటీసెల్ జాయింట్ కన్వీనర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన ఆ పార్టీ నాయకుడు రాహుల్ నేతికార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నాటికి తన శక్తివంచన లేకుండా ఐటీసెల్ ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు పాటుపడతానన్నారు.

సైమా ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



సైమా ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

రసూల్‌పురా: సౌత్ ఇండియా మేకప్ ఆర్టిస్ట్స్ ఎక్స్‌పో (సైమా ఎక్స్‌పో) ది ప్రొఫెషనల్ బ్యూటీ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించారు. ఎక్స్‌పో డైరెక్టర్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ..హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయ నిపుణులతో వివిధ బ్రాండ్‌ల యజమానులు, పంపిణీ దారులను హైదరాబాద్‌లో భాగస్వామ్యం చేయడం ఎక్స్‌పో ఉద్దేశం అన్నారు. వైవిధ్యమైన బ్యూటీ ప్రొడక్ట్స్, స్కిల్‌కేర్ సొల్యుషన్స్, హెయిర్ కేర్ ప్రొడక్ట్స్, కాస్మటిక్స్, నేయిల్ కేర్, స్పా, వెల్నెస్ సర్వీసుల వాటిని ఎక్స్‌పోలో ప్రదర్శిస్తారన్నారు. ఎస్‌బీఎంఎస్ డైరెక్టర్ రాఘవి రెడ్డి మాట్లాడుతూ.. పెళ్లి కుమార్తెల అలంకరణ, మెహిందీ ఆర్ట్, క్రియేటివ్ మేకప్ క్లాసికల్ డాన్స్ పోటీలు, సెమినార్లు, మార్కెటింగ్ అంశాలపై చర్చాగోష్టి ఉంటుందని తెలిపారు. ఈ ఎక్స్‌పో అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సైమా ఎక్స్‌పో సపోర్టింగ్ పార్టనర్ అజీమ్, సుధా జైన్, ప్రొ. రేఖారావు, మయూర్ దోషి పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల ప్రతీక.. రాఖీ వేడుక



అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గచ్చిబౌలి శాంతి సరోవర్‌కు చెందిన బ్రహ్మకుమారిలు శక్తి, మాధవిలు మంత్రికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. –సనత్‌నగర్

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేస్తాం

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



రహదారి నిర్మాణం పనులు ప్రారంభించిన పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని శాసన సభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ చెప్పారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోని విజయపురికాలనీ, కేశవనగర్, ముదిరాజ్ సంఘం, వైట్‌హౌజ్, దాదర్ కాంపౌండ్, మైలార్‌గడ్డ, ఎన్టీఆర్ నగర్, చిలకలగూడ, చితంబావి ప్రాంతాల్లో రూ.1.8 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన రహదారులు, సీవరేజీ లైన్లు తదితర అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో రహదారులు, మురుగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. సీతాఫల్‌మండి విద్యా సంస్థల భవన సముదాయం, కుట్టివెల్లోడి ఆసుపత్రి నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. కొత్తగా మంజూరైన లాలాపేట, అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం పనులు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ సునీత, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్‌లను సత్వరమే లబ్ధిదారులకు అందించాలని సికింద్రాబాద్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ధోబీఘాట్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం నుంచి ప్రదర్శనగా వచ్చిన నాయకులు, కార్యకర్తలు సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణం విషయంలో స్థానిక ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ విఫలమయ్యారని విమర్శించారు. ధోబీఘాట్‌లో నిర్మించిన ఇళ్లు సంవత్సరాలు గడుస్తున్నా లబ్ధిదారులకు అందించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబు, యాదగిరి, సోమయ్య, షేక్ లతీఫ్, నాగరాజు, రాములు, శ్రీహరి పాల్గొన్నారు.

తాళం ఉన్న ఇళ్లే టార్గెట్

చోరీలకు పాల్పడుతున్న పుణే ముఠా రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చందనా దీప్తి

కంటోన్మెంట్: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠాను నార్త్ జోన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి వివరాలు వెల్లడించారు. బోయిన్‌పల్లికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఈ నెల 22న తన ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలతో పాటు ఇతర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు నిందితులను గుర్తించి విచారించగా బోయిన్‌పల్లితో పాటు చిలకలగూడ, మల్కాజ్‌గిరి, గోపాలపురం పోలీసు స్టేషన్‌ల పరిధిలోనూ దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఓ బైక్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో చోరీ చేసిన మొత్తం రూ.4.65 లక్షల విలువ చేసే బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. పుణేకు చెందిన నీలేశ్ అంకుశ్ ఖాలే (51) ఐదుగురు యువకులతో ముఠాగా ఏర్పడి నగరంలో దొంగతనాలకు పాల్పడ్డాడు. మొత్తం ఆరుగురు నిందితుల్లో నీలేశ్‌తో పాటు ఆకాశ్ భవర్ సింగ్ రాజ్‌పుత్ (21), విశాల్ అనిల్ నలవాడే (25) శంకర్ జ్ఞానేశ్వర్ అథవాలే (20)ను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు దినేశ్, షరీఫ్ పరారీలో ఉన్నారు. నిందితులు పుణే నుంచి నగరానికి రైల్లో వచ్చి స్థానికంగా ఓ లాడ్జీలో గదులు అద్దెకు తీసుకున్నారు. వాళ్లు తమవెంట ఓ బైక్‌నూ తెచ్చుకున్నారు. అద్దె ఇళ్ల కోసం వెతుకుతున్నట్లుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి గత వారం నాలుగు చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు నీలేశ్‌పై మహారాష్ట్రలో 25 కేసులు నమోదైనట్లుగా డీసీపీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ రెడ్డి, డీఐ సర్దార్ నాయక్‌ల నేతృత్వంలోని బృందం కీలకంగా వ్యవహరించినట్లు తెలిపారు.